క్లుప్తంగా

తలసీమియా చిన్నారులకు రక్తదానం



రక్తదాత నుంచి రక్తం ప్యాకెట్ అందుకుంటున్న శ్రీకాంత్

కర్నూలు(హాస్పిటల్): స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని లలితమ్మ హెల్పింగ్ హ్యాండ్స్ వ్యవస్థాపకుడు లోకేష్ ఆధ్వర్యంలో ఆదివారం తలసీమియా చిన్నారుల కోసం రక్తదాన శిబిరం నిర్వహించారు. లోకేష్ మాట్లాడుతూ ఈ రక్తదాన శిబిరంలో ఇచ్చిన రక్తం తలసీమియా బాధిత చిన్నారుల ప్రాణం నిలబెడుతుందన్నారు. అనంతరం రక్తదాతలకు కర్నూలు తలసీమియా సొసైటీ వ్యవస్థాపకులు శ్రీకాంత్ ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో మణిశంకర్, కార్తీక్, మధు, సమీర్ పాల్గొన్నారు.

నైతిక విలువలు పెంపొందించాలి



బాలవిహార్‌లో విద్యార్థులకు సందేశం ఇస్తున్న సుప్రేమానంద

కర్నూలు కల్చరల్: పిల్లలకు చిన్నతనం నుంచే నైతిక విలువలు పెంపొందించేలా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కృషి చేయాలని చిన్మయ మిషన్ జిల్లా బాధ్యులు స్వామిని సుప్రేమానంద అన్నారు. కర్నూలు వీఆర్ కాలనీలోని చిన్మయ ప్రభావళి భవన్‌లో ఆదివారం చిన్మయ మిషన్ ఆధ్వర్యంలో బాల విహార్, భగవద్గీత తరగతులు జరిగాయి. ఆమె మాట్లాడుతూ చదువుతో పాటు సంస్కారం నేర్పాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఇతిహాసాలు, పురాణాల్లోని అంశాలు వివరించాలన్నారు.

ఇస్కాన్‌లో భగవద్గీత తరగతులు



జగన్నాథ్, సుభద్ర, బలదేవ్ దేవతా మూర్తులకు హారతి ఇస్తున్న పూజారి

కర్నూలు కల్చరల్: ఇస్కాన్ ఆధ్వర్యంలో స్థానిక భగీరథ కాంప్లెక్స్‌లోని జగన్నాథ మందిరంలో ఆదివారం శీల ప్రభు పాదుల ప్రేమ విందు, భగవద్గీత శిక్షణా తరగతులు నిర్వహించారు. జగన్నాథ్, సుభద్ర, బలదేవ్‌లను ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. కర్నూలు ఇస్కాన్ బాధ్యులు రామకృష్ణ చైతన్య ప్రభు సందేశమిచ్చారు. హిందూ ధర్మం గొప్పదని, దానిని కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. భగవద్గీత పఠనం ఉత్తమ జీవన విధానానికి, మానవ ఉన్నతికి ఉపయుక్తంగా ఉంటుందన్నారు.

ట్యాలీ కోర్సులో ఉచిత శిక్షణ

కర్నూలు సిటీ: నిరుద్యోగ యువతకు ఉన్నతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో కడపలో ట్యాలీ, జీఎస్టీ, కంప్యూటర్ కోర్సుల్లో ఉచిత శిక్షణ, ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్లు ఆ ఫౌండేషన్ కో–ఆర్డినేటర్ హరిప్రసాద్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 10వ తరగతి పాసై, ఇంటర్మీడియెట్ పాస్/ఫెయిల్, డిప్లమా పాస్/ఫెయిల్, డిగ్రీ పాస్/ఫెయిల్ అయిన వారు, 18 నుంచి 26 ఏళ్ల వయస్సు కలిగి ఉన్న వారు శిక్షణకు హాజరుకావచ్చన్నారు. 35 రోజుల కోర్సుల్లో ట్యాలీ, జీఎస్టీ, కంప్యూటర్ స్కిల్స్, స్పోకెన్ ఇంగ్లిషు, కమ్యూనికేషన్ స్కిల్స్, లైఫ్ స్కిల్స్, ఇంటర్వ్యూ స్కిల్స్, వర్క్‌ప్లేస్ స్కిల్స్‌లో ఉత్తమ శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. శిక్షణ కాలంలో ఉచిత భోజనం, వసతి సౌకర్యం కల్పిస్తారని పేర్కొన్నారు. శిక్షణ అనంతరం 100 శాతం ఉపాధి అవకాశం కల్పించడం జరుగుతుందని, నెలకు రూ.15,000పైనే వేతనాలు పొందవచ్చన్నారు. పూర్తి వివరాలకు 9000487423 నంబరు ను సంప్రదించాలన్నారు.

వివాహిత ఆత్మహత్య

కర్నూలు సిటీ: నగరంలో ఓ వివాహిత నిప్పంటించుకొని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నగరంలోని శ్రీనివాసనగర్‌లో రమాకాంత్, శిరీష దంపతులు నివాసం ఉంటున్నారు. కొన్నేళ్లుగా శిరీష మానసిక అనారోగ్యంతో బాధపడుతూ ఓ డాక్టర్ వద్ద చికిత్స తీసుకుంటోంది. ఆదివారం రాత్రి 8 గంటల సమయంలో ఇంట్లోని ఓ గదిలోకి వెళ్లి తలుపులు వేసుకొని కిరోసిన్ పోసుకొని నిప్పు అంటించుకుంది. భర్త ఎంత ప్రయత్నించినా డోర్ తీయలేకపోయాడు. కొద్దిసేపటికే శరీరం ఎక్కువ శాతం కాలిపోడంతో మరణించింది. వీరికి ఒక కుమారుడు సంతానం. 2వ పట్టణ పోలీసులు మృతదేహాన్ని జనరల్ హాస్పిటల్‌కు తరలించారు. ఘటనపై ఎవరూ ఫిర్యాదు చేయలేదని పోలీసులు తెలిపారు.

'సుంకేసుల'లో 0.990 టీఎంసీల నీరు

గూడూరు: సుంకేసుల జలాశయంలో 0.990 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్లు డ్యాం అధికారులు ఆదివారం తెలిపారు. కర్నూలు ప్రజల తాగునీటి అవసరాల కోసం 130 క్యూ సెక్కుల నీటిని విడుదల చేశామన్నారు.

ఇంటి ముంగిటకే సంక్షేమ పథకాలు

- వైఎస్సార్‌సీపీ నంద్యాల, కర్నూలు జిల్లాల అధ్యక్షులు కాటసాని, మేయర్ రామయ్య
- 19వ వార్డులో 'గడప గడపకు మన ప్రభుత్వం'



మహిళలకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి, మేయర్ రామయ్య

కల్లూరు: రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల ఇంటి ముంగిటకే సంక్షేమ పథకాలు అందిస్తున్నారని వైఎస్సార్‌సీపీ నంద్యాల, కర్నూలు జిల్లాల అధ్యక్షులు, ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి, మేయర్ బీవై రామయ్య అన్నారు. ఆదివారం కల్లూరు అర్బన్ 19వ వార్డు సరస్వతినగర్, ఇంజనీరింగ్ కాలనీలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. వారు వార్డులో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరిస్తూ, బుక్‌లెట్లను పంపిణీ చేశారు. ప్రజల సమస్యల పరిష్కారానికే ప్రజా ప్రతినిధులందరం గడప గడపకు వస్తున్నామన్నారు. కాలనీలో డ్రైనేజీ కాలువలు, సీసీ రోడ్లు నిర్మించాలని, ఖాళీ స్థలాల్లో ముళ్లపొదలు పెరగడంతో రాత్రి సమయంలో ఇబ్బందులు పడుతున్నట్లు ప్రజలు ఎమ్మెల్యేకు తెలియజేశారు. ఆయా సమస్యలను సకాలంలో పరిష్కరించాలని ఆయన మున్సిపల్ అధికారులను ఆదేశించారు.

నవరత్నాలతో విజయం

ఎమ్మెల్యే కాటసాని, మేయర్ రామయ్య మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో మేము అందిస్తున్న నవరత్నాల పథకాలతో విజయం సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. టీడీపీ పాలనకు ఈ నాలుగేళ్లుగా అందిస్తున్న వైఎస్సార్‌సీపీ పాలనలో తేడాను గమనించాలన్నారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల చెంతకే పాలనతో సంక్షేమ పథకాల ద్వారా పేదల జీవితాల్లో వెలుగులు నింపుతున్నారని కొనియాడారు. కార్యక్రమంలో రాష్ట్ర వీర శైవ లింగాయత్ కార్పొరేషన్ డైరెక్టర్ గోపాల్‌రెడ్డి, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ మహేశ్వర్ రెడ్డి, కార్పొరేటర్లు లక్ష్మీకాంతరెడ్డి, శ్వేతారెడ్డి, ఆయిషా సిద్ధిఖా, వెంకటేశ్వర్లు, లక్ష్మిరెడ్డి, నారాయణరెడ్డి, కల్లూరు సింగిల్ విండో చైర్మన్ శివశంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించాలి



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ వైద్య విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఆదిమూలపు సతీష్

కోడుమూరు: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, గ్రామ సచివాలయ వ్యవస్థపై ప్రజలకు మరింత అవగాహన కల్పించేందుకు కృషి చేస్తున్నామని వైఎస్సార్‌సీపీ వైద్య విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఆదిమూలపు సతీష్ అన్నారు. ఆదివారం కోడుమూరులోని నాగార్జున విద్యానిలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆగస్టు 15 స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని 'గ్రామ స్వరాజ్యం – ప్రభుత్వం చర్యలు' అనే అంశంపై నియోజకవర్గంలోని ప్రభుత్వ హైస్కూళ్లలో సుమారు వెయ్యి మందికి పైగా విద్యార్థినీ, విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించడం జరిగిందన్నారు. పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు స్వాతంత్య్ర దినోత్సవ వేడుకల సందర్భంగా నియోజకవర్గ సమన్వయ కర్త, కుడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి చేతుల మీదుగా బహుమతులను అందజేస్తామని చెప్పారు. అలాగే ఆగస్టు 15నుంచి కోడుమూరు నియోజకవర్గంలోని గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ వైద్య విభాగం ఆధ్వర్యంలో ప్రజలకు ఉచితంగా వైద్య పరీక్షలను నిర్వహించడంతో పాటు, రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వైఎస్సార్ ఆరోగ్యశ్రీపై ప్రజల్లో అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎస్ఆర్‌సీ బీఈడీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ నబి తదితరులున్నారు.

ఇంటింటి సర్వేను త్వరితగతిన పూర్తి చేయాలి



కె.నాగలాపురంలో సర్వే వివరాలను అడిగితెలుసుకుంటున్న ఆర్‌డీఓ హరిప్రసాద్

గూడూరు రూరల్: బీఎల్‌ఓలు ఇంటింటి సర్వేను త్వరితగతిన పూర్తి చేయాలని ఆర్‌డీఓ హరిప్రసాద్ ఆదేశించారు. కె.నాగలాపురంలో జరుగుతున్న సర్వేను ఆదివారం ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ వ్యాప్తంగా చేపట్టిన ఇంటింటి సర్వేను బీఎల్‌ఓలు చురుగ్గా నిర్వహిస్తున్నారని, గడువులోగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకున్నామని చెప్పారు. ఓటరు నమోదు, అడ్రస్‌లో మార్పులు, చేర్పులు, స్థానికులు కాని బోగస్ ఓటర్ల గుర్తింపు తదితర అంశాలపై ఇంటింటికి తిరిగి సర్వే కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందన్నారు. బీఎల్‌ఓలకు ఓటర్లు సహకరించాలని కోరారు. ఆయన వెంట తహసీల్దార్ శివశంకర్ నాయక్ ఉన్నారు.

పాలనా అంశాల్లో పట్టు సాధించాలి



సచివాలయాల కార్యదర్శులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న మేనేజర్ చిన్నరాముడు

కర్నూలు (టౌన్) : పాలనా అంశాల్లో పట్టు సాధిస్తేనే ఉద్యోగంలో రాణిస్తారని నగరపాలక మేనేజర్ చిన్నరాముడు అన్నారు. ఆదివారం స్థానిక సీతారామనగర్‌లో 24 నుంచి 46వ వార్డు సచివాలయాల కార్యదర్శులకు సర్వీస్ రూల్స్, కండక్ట్ ఆఫ్ రూల్, అడ్మినిస్ట్రేషన్ అంశాలపై మూడవ బ్యాచ్ శిక్షణ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రజల ముంగిటకే పాలన పేరుతో ప్రభుత్వం స్థానికంగా ప్రజలకు అందుబాటులో సచివాలయాల వ్యవస్థను తీసుకువచ్చిందన్నారు. ప్రభుత్వం అందించే ప్రతి సంక్షేమ పథకం తప్పనిసరిగా అర్హులైన వారందరికీ అందించాలన్నదే దీని ఉద్దేశమన్నారు. అందులో పనిచేసే సచివాలయాల కార్యదర్శులు ప్రజలకు మెరుగైన పాలన అందించేందుకు స్కిల్ అప్‌గ్రేడేషన్ శిక్షణను అందిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో శిక్షణ కేంద్రం కో ఆర్డినేటర్ వాసు పాల్గొన్నారు.

పరిపూర్ణ మానవులుగా తీర్చిదిద్దడమే లక్ష్యం



మాట్లాడుతున్న సత్యసాయి సేవా ట్రస్ట్ జిల్లా అధ్యక్షులు మాకా అశోక్ కుమార్

కర్నూలు కల్చరల్: పరిపూర్ణ మానవులుగా తీర్చిదిద్దడమే బాలవికాస్ లక్ష్యమని శిక్షణా శిబిరం, విద్యా విభాగం రాష్ట్ర సమన్వయకర్త శకుంతల అన్నారు. సత్యసాయి సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక నెహ్రూనగర్‌లోని సత్యసాయి మందిరంలో బాలవికాస్ గురువులకు ఒక్కరోజు శిక్షణా కార్యక్రమం జరిగింది. ఆమె మాట్లాడుతూ తొమ్మిది సంవత్సరాల పాటు ప్రతి ఆదివారం ఉదయం 10 నుంచి 11 గంటల వరకు రాష్ట్రంలోని సత్యసాయి మందిరాలు, దత్తత పాఠశాలల్లో బాలవికాస్ తరగతులు జరుగుతాయన్నారు. 5 నుంచి 15 సంవత్సరాల లోపు బాల బాలికలు తరగతులకు హాజరు కావచ్చని చెప్పారు. ఇందులో విద్యార్థుల్లో నైతిక విలువలు, ఆత్మవిశ్వాసం పెంపొందించడం, సమాజంలో ఎలా మెలగాలనే అంశాలపై శిక్షణ పొందిన గురువులచే సంపూర్ణ అవగాహన కల్పిస్తామన్నారు. జిల్లా విద్యా విభాగం కో ఆర్డినేటర్లు మాధురి, సాయి కృష్ణారెడ్డి, బాలవికాస్ గురువుల శిక్షకులు రాజేంద్రప్రసాద్, కిరణ్‌కుమార్, సుబోధయ శిక్షణ ఇచ్చారు. సత్యసాయి సేవా ట్రస్ట్ జిల్లా అధ్యక్షులు మాకా అశోక్ కుమార్ అధ్యక్షతన కార్యక్రమం జరిగింది.

కోలుకోలేక వృద్ధుడి మృతి

కర్నూలు (టౌన్) : కర్నూలు నగరంలోని ఔట్‌డోర్ స్టేడియం వద్ద ఈనెల 5వ తేదీన గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో గాయపడిన వడ్డేగేరికి చెందిన సూర్య తిరుపతయ్య (92) అనే వృద్ధుడు చికిత్స పొందుతూ కోలుకోలేక ఆదివారం మృతి చెందినట్లు ట్రాఫిక్ పోలీసులు తెలిపారు. ఈనెల 5న ఔట్‌డోర్ స్టేడియం వద్ద సూర్య తిరుపతయ్య నిలబడి ఉండగా ఓ గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టి వెళ్లి పోయింది. దీంతో అతని తలకు తీవ్ర గాయాలు కాగా.. సమాచారం మేరకు ట్రాఫిక్ పోలీసులు కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పటి నుండి చికిత్స పొందుతున్న ఆయన ఆదివారం మృతి చెందాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ట్రాఫిక్ పోలీసులు తెలిపారు.

18న షాపింగ్ కాంప్లెక్స్ ప్రారంభోత్సవం

కర్నూలు(అగ్రికల్చర్): పసుపల ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం (పీఏసీఎస్) పరిధిలో నిర్మించిన షాపింగ్ కాంప్లెక్స్‌ను ఈ నెల 18న ప్రారంభించనున్నట్లు సీఈఓ మురళీధర్ చౌదరి ఆదివారం తెలిపారు. కర్నూ లు మండలం పసుపల పీఏసీఎస్ మల్టీ సర్వీస్ సెంటరుగా అభివృద్ధి చెందింది. ఈ పీఏసీఎస్‌ను మరింత లాభాల బాట పట్టించేందుకు నాబార్డు, కేడీసీసీ బ్యాంకు సహకారంతో రూ. 35 లక్షల వ్యయంతో చేపట్టిన షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణపు పనులు పూర్తి అయ్యాయి. నా బార్డు రూ.23 శాతం, కేడీసీసీబీ రూ.10 లక్ష లు, పీఏసీఎస్ రూ.3 లక్షలు... మొత్తంగా రూ. 35 లక్షలతో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించారు.

రేపు ఉచిత వైద్యశిబిరం

కర్నూలు(హాస్పిటల్): స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 15న ఉచిత వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు ఇండియన్ మెడికల్ అసోసియేషన్ కార్యదర్శి డాక్టర్ ఎస్వీ రామమోహన్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటలకు డాక్టర్స్ కాలనీలోని పార్థసారథినగర్‌లో ఉన్న ఐఎంఏ భవనంలో ఉదయం జాతీయ పతాకాన్ని ఎగురవేసి, అనంతరం ఉచిత వైద్యశిబిరాన్ని మాజీ రాజ్యసభ్యులు టీజీ వెంకటేష్ ప్రారంభిస్తారన్నారు. శిబిరంలో జనరల్ ఫిజీషియన్, జనరల్ సర్జన్, చిన్నపిల్లల వైద్యులు, చర్మవ్యాధి నిపుణులు, గుండెవ్యాధి నిపుణులు, యురాలజీ, న్యూరాలజీ, ఆర్థోపెడిక్, స్త్రీ వ్యాధినిపుణులచే వ్యాధినిర్ధారణ పరీక్షలు చేసి, ఉచిత వైద్యసలహాలు, చికిత్స అందిస్తారన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని కోరారు.

బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలి

కర్నూలు(రూరల్): రోడ్డు ప్రమాదంలో మరణించిన బిర్లాగడ్డకు చెందిన భవన నిర్మాణ కార్మికుడు పెద్ద మద్దిలేటి కుటుంబాన్ని ఆదుకోవాలని సీఐటీయూ నగర అధ్యక్ష, కార్యదర్శులు సుధాకరప్ప, నరసింహులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం రాత్రి కర్నూలు నుంచి నాగలాపురం వైపు వెళ్తుండగా లారీ గుద్దడంతో పెద్ద మద్దిలేటి అక్కడికక్కడే మరణించాడు. సీఐటీయూ నగర కమిటీ నాయకులు ఆదివారం బిర్లాగడ్డకు చేరుకుని మృతుడి పార్థీవదేహానికి పూలమాల వేసి, ఆయన కుటుంబ సభ్యులను ఓదార్చారు. ప్రభుత్వం మృతుడి కుటుంబానికి రూ.10 లక్షల ఆర్థిక సహాయం చేసి ఆదుకోవాలన్నారు. మృతుడికి భార్య లక్ష్మిదేవి, ముగురు కుమారులు వున్నారు.

నిర్లక్ష్యపు మొక్కలు





ఆసుపత్రి చుట్టూ గోడలపై మొలచిన మొక్కలు





120 ఏళ్ల చరిత్ర కలిగిన కర్నూలులోని మొట్టమొదటి ఆసుపత్రి.. గడియారం ఆసుపత్రి.. నగరంలోని పాతబస్తీలో ఉన్న ఈ ఆసుపత్రి నగర ప్రజలకు స్వాతంత్య్రానికి పూర్వం నుంచే వైద్యసేవలు అందిస్తోంది. ఇప్పటికీ ఆసుపత్రిలో ప్రజలు వైద్యసేవలు పొందుతూనే ఉన్నారు. అయితే ఆసుపత్రి భవనం శిథిలావస్థకు చేరుకునే విధంగా గోడల చుట్టూ పెద్ద పెద్ద మొక్కలు పెరిగాయి. అవి క్రమంగా పెరుగుతుండటంతో ఆసుపత్రి రూపురేఖలు మారిపోయి, పాడుబడిన బంగ్లా లాగా దర్శనమిస్తోంది. అధికారులు చర్యలు తీసుకొని మొక్కలు మాన్లుగా మారి గోడలను కూల్చక ముందే వాటిని తొలగించాలని పాతబస్తీ వాసులు కోరుతున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, కర్నూలు

పథకాల అమలులో దేశానికే ఆదర్శం

- ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్
- 45వ వార్డులో 'గడప గడపకు మన ప్రభుత్వం'

కర్నూలు సిటీ: దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా ఏపీలో సంక్షేమ పథకాలు అమలు అవుతున్నాయని, ఈ పథకాలే దేశానికి ఆదర్శంగా నిలుస్తున్నాయని కర్నూలు ఎమ్మెల్యే ఎం.ఏ హఫీజ్‌ఖాన్ అన్నారు. ఆదివారం నగరంలోని 45వ వార్డు 116వ సచివాలయం పరిధిలోని లేబర్ కాలనీ విధుల్లో గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను, వాటి నుంచి పొందిన లబ్ధిని వివరించారు. ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ.. పేదల ఆర్థికాభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని, ప్రతి లబ్ధిదారులకు వలంటీర్ల ద్వారా ఇంటి వద్దకే పథకాలు చేరుతున్నాయన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆర్థికాభివృద్ధితోనే పేదల బతుకులు మారుతాయన్నారు. ఈ ఉద్దేశ్యంతోనే సీఎం వై.ఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రతి ఇంటికి మేలు చేసేలా పథకాలు తీసుకోచ్చి పారదర్శకంగా పథకాలను అమలు చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో 45వ వార్డు వైఎస్సార్‌సీపీ నాయకుడు ప్రభుదాస్, జమ్మన్న, భాస్కర్ రెడ్డి, సితార ఇర్ఫాన్, షేక్, సాదిక్, జోషిరాజ్, చందు, ఖాదర్ బాష, జనార్దన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



లేబర్ కాలనీలో సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే హఫీజ్ ఖాన్

శ్రీ వీరనారాయణుడి సన్నిధిలో లోక్ అదాలత్ జడ్జి



స్వామి వారి సన్నిధిలో ప్రదక్షిణలు చేస్తున్న లోక్ అదాలత్ జడ్జి శ్రీనివాసరావు కుటుంబ సభ్యులు

పాణ్యం: మండల కేంద్రంలో వెలసిన శ్రీ వీరనారాయణస్వామి ఆలయంలో ఆదివారం కర్నూలు లోక్ అదాలత్ జడ్జి సీ.హెచ్.వి.ఎన్ శ్రీనివాసరావు కుటుంబ సభ్యులతో కలిసి పూజలు నిర్వహించుకున్నారు. ఆలయ ఈఓ లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో వేదపండితులు సుబ్బశాస్త్రి సమక్షంలో ఆలయంలో విశిష్ట పూజలు చేశారు. పూజల అనంతరం ఈఓ జడ్జిని సన్మానించి, తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో అర్చకులు కిట్టయ్య, ఆలయ సిబ్బంది తిరుమలయ్య, మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.

నేడు తిరంగా ప్రదర్శన

కర్నూలు కల్చరల్: ఏపీ ప్రభుత్వ భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'నా మట్టి– నా దేశం' కార్యక్రమంలో భాగంగా సోమవారం ప్రభుత్వ శారదా సంగీత నృత్య కళాశాల ఆధ్వర్యంలో జాతీయ పతాకంతో తిరంగా ర్యాలీ నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ మునికుమార్ తెలిపారు. సాయంత్రం 5 గంటలకు కళాశాల నుంచి కొండా రెడ్డి బురుజు వరకు ర్యాలీ సాగుతుందని పేర్కొన్నారు.

ప్రభుత్వ వాహనం .. షెడ్డుకే పరిమితం



వ్యవసాయ శాఖలో మూలన పడి ఉన్న ప్రభుత్వ వాహనం



మూలన ఉండిపోయిన వాహనం

కర్నూలు(అగ్రికల్చర్): ప్రభుత్వ వాహనాల వినియోగించుకోవడంపై అధికారులు అలసత్వం వహిస్తున్నారు. కండీషన్‌లో ఉన్న వాహనాలను సైతం షెడ్డుకు పరిమితం చేస్తున్నారు. అధికారుల తీరుపట్ల ప్రభుత్వ వాహన డ్రైవర్లు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. జిల్లా వ్యవసాయ శాఖకు సంబంధించి ఏపీ 21పీ 2962 నంబరుగల వాహనం కండీషన్‌లోనే ఉంది. చిన్న, చిన్న మరమ్మతులు వచ్చాయి. రూ.30 వేల నుంచి రూ.50 వేల వరకు ఖర్చు పెట్టి రిపేరు చేయిస్తే రోడ్డుపై పరుగులు పెడుతుంది. కానీ అధికారులు పట్టించుకోకుండా ఈ వాహనాన్ని కొన్ని నెలలుగా షెడ్డుకే పరిమితం చేశారు. ఇటువంటి పరిస్థితి దాదాపు అన్ని శాఖల్లో ఉండటం గమనార్హం. వివిధ శాఖల అధికారులు అద్దె వాహనాలపై మోజులో చిన్న, చిన్న రిపేర్లకే వాహనాలను పక్కన పెట్టేస్తున్నారు. ఇదిలా ఉండగా వివిధ శాఖల అధికారులు సొంత వాహనాలనే బినామీ పేర్లతో వినియోగిస్తూ ప్రభుత్వం నుంచి అద్దె బిల్లులను పొందుతున్నట్లు విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఆ వాహనాలకు ఎల్లో బోర్డు ఉండదు. టాక్స్ చెల్లించరు. లాగ్ బుక్ నిర్వహించరు. అద్దె వాహనాల బిల్లులు మాత్రం పొందుతున్నట్లు ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. జిల్లా అధికారులకు వాహనాల నెలసరి అద్దె రూ.65వేలు, కిందిస్థాయి అధికారులకు రూ.35వేలు ప్రభుత్వం చెల్లిస్తోంది.

మమ్మేలవమ్మా మహా గౌరీ!



ప్రత్యేక అలంకారంలో మహాగౌరి అమ్మవారు



కోటి కుంకుమార్చనలో పాల్గొన్న భక్తులు

కర్నూలు కల్చరల్: అధిక శ్రావణ మాసాన్ని పురస్కరించుకొని స్థానిక సూర్యనారాయణ స్వామి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీ మహా గౌరీ పరదేవతా సన్నిధిలో నిర్వహిస్తున్న శ్రీలలితా సహస్రనామ పారాయణ పూర్వక కోటి కుంకుమార్చన మహాయజ్ఞం ముగింపు కార్యక్రమంలో భాగంగా విశేష పూజలు జరిగాయి. గణపతి పూజ, మంటపారాధన, లలిత సహస్రనామ పారాయణ పూర్వక సామూహిక కుంకుమార్చన, క్షీర తర్పణం నిర్వహించారు. పత్తికొండ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి, ఆలయం మేనేజింగ్ ట్రస్టీ శివరామకృష్ణ, ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా 3కే రన్



క్రీడా జ్యోతిని వెలిగించి 3కే రన్‌ను ప్రారంభిస్తున్న కేడీసీఏ జిల్లా కార్యదర్శి దేవేందర్ గౌడ్

కర్నూలు(రూరల్): క్రికెట్‌లో అంతర్జాతీయ స్థాయి క్రీడాకారులను తయారు చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నామన్ని కర్నూలు జిల్లా క్రికెట్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి దేవేందర్ గౌడ్ తెలిపారు. మన ఆంధ్రా–మన ఏపీఎల్ సీజన్–2ను పురస్కరించుకొని ఆదివారం నగరంలో నిర్వహించిన 3కే రన్ ఉత్సాహంగా సాగింది. ఉదయం 7 గంటలకు ఔట్‌డోర్ స్టేడియం నుంచి వైఎస్సార్ సర్కిల్, రాజ్ విహార్, ప్రకాష్ నగర్ మీదుగా సెయింట్ జోసెఫ్స్ డిగ్రీ కళాశాల వరకు రన్ కొనసాగింది. దేవేందర్ గౌడ్ మాట్లాడుతూ విశాఖలో ఈ నెల 16 నుంచి 27వ తేదీ వరకు ఆంధ్రా ప్రీమియర్ లీగ్ సీజన్–2 పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రైవేట్ వ్యాయమ ఉపాధ్యాయుల సంఘం జిల్లా అధ్యక్షులు కే చిన్న సుంకన్న, కేడీసీఏ కోశాధికారి శ్రీనివాసులు, కోచ్‌లు అజ్మతుల్లా, శ్రీనివాసులు తదితరులు పాల్గన్నారు.

గోవులను రక్షించుకుందాం



బాలకృష్ణ గురుస్వామికి జ్ఞాపిక బహూకరిస్తున్న ఎమ్మెల్యే కాటసాని

కర్నూలు కల్చరల్: గోవులకు రక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. బాలకృష్ణ గురుస్వామి చేపట్టిన గో మహా పాదయాత్ర ఆదివారం ఉదయం కర్నూలుకు చేరుకుంది. బాలాజీ నగర్ షిర్డీ సాయిబాబా దేవాలయం వద్ద నగర వాసులు ఘనంగా స్వాగతం పలికారు. అక్కడి నుంచి వీఆర్ కాలనీ, సీతారాం నగర్, కొత్త బస్టాండ్, బళ్లారిచౌరస్తా, చెన్నమ్మ సర్కిల్ మీదుగా కల్లూరు ఎస్టేట్‌లోని అవధూత రామిరెడ్డి తాత గోశాలకు చేరుకుంది. అక్కడ ఎమ్మెల్యే కాటసాని బాల కృష్ణ గురుస్వామిని, పాదయాత్ర బృందాన్ని సన్మానించి అభినందించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గో రక్షణకు, గోవును జాతీయ ప్రాణిగా ప్రకటించాలని కోరుతూ హైదరాబాద్ నుంచి అరుణా చలం వరకు 'గో మహా పాదయాత్ర' చేయడం అభినందనీయమన్నారు. గో రక్షణకు అందరూ ముందుకు రావాలన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ విక్రమసింహారెడ్డి, అవధూత రామిరెడ్డి తాత గోశాల ట్రస్ట్ అధ్యక్షులు దాసరి రామచంద్రారెడ్డి, భజరంగ్ దళ్ రాష్ట్ర కన్వీనర్ ప్రతాప్‌రెడ్డి, షిర్డీ సాయి బాబా దేవాలయం కమిటీ సభ్యులు ప్రతాప్‌రెడ్డి, యుగంధర్ శెట్టి తదితరులు పాల్గొన్నారు.